క్లుప్తంగా

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని చిన్న గోల్కొండ సొసైటీ ఆధ్వర్యంలో వ్యవసాయ రుణాలను రైతులకు సోమవారం పంపిణీ చేశారు. చైర్మన్ బి.దొనాకర్‌గౌడ్ చేతుల మీదుగా రైతులకు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాల రూ. 31.90 లక్షలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సాహిల్ సింగ్‌కు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన సాహిల్ సింగ్

జియాగూడ: రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తమిళనాడు అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 12వ సౌత్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ నుంచి 92 కేజీల విభాగంలో సాహిల్ సింగ్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 27 నుంచి తమిళనాడు జోహిందర్ స్పోర్ట్స్ అకాడమి, తమిళనాడు స్టేట్ ఒలింపిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ అథారిటీ ఆఫ్ తమిళనాడు సేలమ్‌లో ప్రారంభమైన పోటీలలోమంగళ్‌హాట్ ధూల్‌పేట్ లాలా తాలిమ్‌కు చెందిన క్రీడాకారుడు సాహిల్ సింగ్ గోల్డ్ మెడల్ సాధించడం గర్వంగా ఉందని శిక్షకుడు పర్వేష్ సింగ్ పహిల్వాను తెలిపారు. ఈ సందర్భంగా సాహిల్ సింగ్ మాట్లాడుతూ.. ధూల్‌పేట్ మినీ స్టేడియంలో జరిగిన శివాజీ కేసరి లాలా కేసరి, సుభాష్ చంద్రబోస్ కేసరి, తుల్జాభవాని కేసరి, ఉస్మానియా యూనివర్సిటీలలో బంగారు షీల్డ్‌లను గెలిచినట్లు తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం


కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ సోమవారం ఆయనను కలిశారు. రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేపడుతున్న నిరసన కార్యక్రమం వివరాలను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సంవత్సర పాలనలోనే ప్రజలకు రేవంత్‌రెడ్డి నిజస్వరూపం తెలిసిపోయిందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందంటే అది ప్రభుత్వ అవినీతికి నిదర్శం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఆయనను కలిసిన వారిలో వెంకటేష్‌సాగర్, శ్రీనాథ్ తదితరులున్నారు.

దళితులు, బీసీలకు అండగా మజ్లిస్: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ నిరుపేదలు, బీసీలు, దళితులకు అండగా ఉంటుందని శాసన సభ మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆయనను కలిశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్ గురించి చేసిన వాఖ్యలపై మజ్లిస్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బహిరంగ సభ విశేషాలను ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ..నగరానికి దళిత మేయర్‌ను అందించిన ఘనత మజ్లిస్ పార్టీదే అని అన్నారు. మజ్లిస్ పార్టీ తరఫున ఎందరో దళిత సోదరులు, పేద బడుగు వర్గాల వారు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారని ఆయన గుర్తు చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో దళిత బస్తీల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆయన కౌసర్ మోహియుద్దీన్‌కు సూచించారు.

న్యూ ఇయర్ జోష్.. పారాహుషార్!

- ఈవెంట్‌ల నిర్వాహకులకు అవగాహన
- వేడుకలకు అనుమతులు తప్పనిసరి
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తథ్యం
- మాదాపూర్ ఎస్‌ఓటీ డీసీపీ శోభన్‌కుమార్


ఈవెంట్ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఓటీ డీసీపీ

మణికొండ: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఓటీ మాదాపూర్ డీసీపీ శోభన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం నార్సింగిలోని ఎస్‌ఓటీ డీసీపీ కార్యాలయంలో ఈవెంట్‌ల నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... వేడుకలలో డ్రగ్స్ వాడరాదని, శబ్ద కాలుష్యం లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఫైర్ సేఫ్టీ, మహిళల భద్రత, నిర్ణీత వేళలు, సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేయాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వాటిని ఎలా అధిగమించాలో అంటూ ఆయన ఉదాహరణలతో వివరించారు. ప్రజలు ఎక్కువగా వస్తే అనుమతించవద్దని, హాల్ కెపాసిటీ తగ్గట్టుగానే టికెట్లను జారీ చేయాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. తమ సిబ్బంది, అధికారులు ఈవెంట్‌లను పరిశీలిస్తారని, నిబంధనల ప్రకారం అవి జరగకపోతే వెంటనే వాటిని నిలిపివేయటంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎస్. సంజయ్‌కుమార్, ఎస్సైలు బాలరాజు, శ్రీనివాస్, సిబ్బంది, ఈవెంట్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు అనుమతి

రాజేంద్రనగర్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్, వైన్ షాపులకు అర్ధరాత్రి వరకు మద్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రావు తెలిపారు. శంషాబాద్ ఎక్సైజ్ ఎపోలీస్‌స్టేషన్ పరిధిలో 55 బార్లు, 35 వైన్స్ దుకాణాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వైన్స్ దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు విక్రయించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. బార్ షాపులకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి ఇచ్చిందని ఒంటి గంటలోపు మాత్రమే బార్‌లో ఉన్న వినియోగదారులకు మందును విక్రయించాలన్నారు. నియమ నిబంధనలు పాటించని వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. ఈవెంట్లు, వేడుకలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. వేడుకల్లో ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోని వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కోదండ రామాలయ నిర్మాణానికి విరాళాలివ్వండి


కొనసాగుతున్న కోదండ రామాలయం నిర్మాణ పనులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ మైహోం అవతార్ ఎదుట సంకట హర హనుమాన్ ఆలయ ఆవరణలో కొత్తగా కోదండ రామాలయాన్ని నిర్మిస్తున్నామని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు, భక్తులు తమకు తోచిన విధంగా విరాళలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే దేవాలయం ఆవరణలో భక్తుల సహకారంతో శివాలయం, రేణుకాఎల్లమ్మ దేవాలయాలను నిర్మించామన్నారు. శని, మంగళవారాలలో నిర్వహించే అన్నదాన షెడ్‌లను నిర్మించామన్నారు. ప్రస్తుతం కోదండ రామాలయం నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. నిర్మాణానికి అవసరమైన సామగ్రి, డబ్బు రూపంలో విరాళం ఇవ్వాలని ఆలయ కమిటీ నాయకుడు దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. దేవాల యం వద్ద విరాళాల కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

బండ్లగూడను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం


డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న ప్రజలు

బండ్లగూడ: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ రంగారెడ్డి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీతో పాటు ఇతర కాలనీల వాసులు సోమవారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కలసి డ్రైనేజీ, రోడ్డు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. రంగారెడ్డి కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ హామీతో కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యతతో పనులు పూర్తిచేయాలి


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ పురుషోత్తం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలని, అపుడే పదికాలాల పాటు అవి ప్రజలకు ఉపయోగపడతాయని మణికొండ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ డి.పురుషోత్తం అన్నారు. సోమవారం ఆయన తన వార్డులో జరుగుతున్న కమ్యూనిటీ హాల్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డు పరిధిలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు అదనంగా పనులను చేపట్టామన్నారు. మరికొన్ని పనులను రాబోయే రోజుల్లో మున్సిపాలిటీలో తీర్మానం చేసి వాటిని చేపడతామన్నారు.

వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదర్షాకోట్ ఎర్రకుంటలో రూ. 50 లక్షల నిధులతో చేపట్టిన వాకింగ్ ట్రాక్ పనులను ఆయన పరిశీలించారు. స్థానిక నేత టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


చెక్కులను అందజేస్తున్న ధర్మపురి ముదిరాజ్

మణికొండ: అనారోగ్యంతో చికిత్స పొంది అప్పుల పాలవుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) పథకం ఓ వరంలా ఆదుకుంటోందని నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.ధర్మపురి ముదిరాజ్ అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన రాసురి లలిత, పర్మల మేల్లష్‌యాదవ్‌లకు రూ. 60 వేలు, ఎం.నిఖిల్‌రెడ్డికి రూ. 40 వేలను సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ధర్మపురి మాట్లాడుతూ... పేదలకు ఉపయోగపడే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తున్నదన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు దార వెంకటేష్, నాయకులు కుమ్మరి శేఖర్, చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, మధుయాదవ్, భావన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు


సర్టిఫికెట్లు తీసుకుంటున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: జాతీయ అబాకస్–2024 పోటీల్లో రాజేంద్రనగర్ కిస్మత్‌పూర్ స్మార్ట్ కిడ్స్ లర్న్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. పూణేలో ఈ నెల 29వ తేదీన జరిగిన పోటీల్లో 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రిత్విక్, దేవాదిత్య, లక్ష్మీచరణ్, నిత్యశ్రీలు జాతీయ స్థాయి అవార్డులు దక్కించుకున్నారన్నారు. స్మార్ట్ కిడ్ అబాకస్ చైర్మన్ సంజయ్ కమలాకర్ చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు సత్తాచాటారన్నారు. జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు పాల్గొని విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం


రాజేంద్రనగర్‌లో అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయ సమీపంలో సోమవారం హెల్ప్ ఆన్ వీల్స్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 30వ తేదీన నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు బండ్లగూడెం కవితప్రసాద్ మాట్లాడుతూ... గడచిన మూడు నెలలుగా నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రమోద్, మహేందర్‌కుమార్, నరేందర్, కె.వి.ఎస్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

మణికొండ: ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం చేయటం ఎంతో ఆనందంగా ఉందని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. ఆదివారం అమావాస్య సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని వారి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నెలా అమావాస్య రోజు క్రమం తప్పకుండా తమ అసోసియేషన్ తరఫున అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాల నిర్వహణలో తమ సభ్యులు ముందుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలో...

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్ మానస హిల్స్‌లోని వరసిద్ది పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అభిషేకంతో ప్రారంభమైన ప్రత్యే పూజలు రోజంతా కొనసాగాయి. మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు వి.మహేష్, ఎ.సుబ్బారావు, వి.నవీన్‌కుమార్, శ్రీరాములు, సాంబశివారెడ్డి, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్పా


పూజలో పాల్గొన్న అశోక్‌యాదవ్ తదితరులు

మణికొండ: స్వామియే శరణం అయ్యప్పా అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణలతో నార్సింగి గ్రామం మారుమోగింది. సోమవారం గురుస్వామి శ్రీనివాస్ తన 18వ మహాపడి పూజను సాయిబాబా ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగి నర్సింగ్‌రావు భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు అందరినీ అలరించాయి. గురుస్వామి ఆనందాచార్యులు ఆధ్వర్యంలో సన్నిధానం స్వాములు 18 మెట్ల మహాపడిని కాల్చారు. అనంతర డి.జగదాంబా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ డి.వేణుగౌడ్, నాయకులు రాము, పాపిరెడ్డి, శ్రీనివాస్, వినోద్‌కుమార్, కిరణ్‌కుమార్, ప్రభుకుమార్, జల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ప్రవచనాలు

రాజేంద్రనగర్: ధనుర్మాసం సందర్భంగా హైదర్‌గూడ చైతన్య విల్లాస్ కాలనీలోని సీతారామ చంద్ర స్వామి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. డిసెంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రవచనాలు జనవరి 14వ తేదీ వరకు కొనసాగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో రోజూ దేవాలయంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి దేవస్థానం అల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేదపండితులు టి.కె.వి.ఆర్.అభిరామ్ పూజా కార్యక్రమాలను చేపడుతున్నారు. కార్యక్రమాల నేపథ్యంలో దేవాలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

'ప్రజావాణి'లో నాలుగు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఇంజినీరింగ్, వీధి దీపాలు, టౌన్‌ప్లానింగ్‌లకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... డివిజన్‌ల పరిధిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



మైలార్‌దేవ్‌పల్లి: సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి పరస్పరం సహకరించుకోవాలని కాటేదాన్ సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు అడికె మల్లేష్ అన్నారు. సోమవారం సెంట్రింగ్ కార్యాలయంలో కాంట్రాక్టర్ల సమక్షంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతి నెల అమావాస్య రోజున కార్యాలయానికి కాంట్రాక్టర్లు రావాలని సూచించారు. ప్రతి నెలా పొదుపు డబ్బులను తప్పని సరిగా చెల్లించాలన్నారు. త్వరలో సెంట్రింగ్ ధరల పెంపునకు అందరి సలహా మేరకు కృషి చేస్తానని వెల్లడించారు. అధ్యక్షుడు అడికె మల్లేష్, ఉపాధ్యక్షుడు ఎస్.శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జి.వెంకటేష్, జాయింట్ సెక్రటరీ ఎం.దేవప్ప, కోశాధికారి ఎస్.బాల్‌రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అశోక్, ఎ.శంకర్, సలహాదారులు ఎం.దర్శన్, జి.యాదగిరి, పి.శేఖర్, సింహాద్రి, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ఎం.రమేష్, జి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.


యోగా విద్యార్థులతో అసోసియేషన్ నాయకులు

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

మణికొండ: నిత్యం క్రమం తప్పకుండా యోగా చేస్తే వారు పరిపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని తిరుమలహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.అవినాష్ అన్నారు. కాలనీలో సోమవారం రాష్ట్ర యోగా గంగోత్రి అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శారీరక శ్రమ లేనందున ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. నిత్యం అరగంట పాటు యోగాసనాలు, ప్రాణాయామం చేస్తే ఎన్నో సమస్యలు తీరతాయన్నారు. గంగోత్రి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ... ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని దీపికకు రూ. 2500ల పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి సుబాష్‌నారాయణ్, డాక్టర్ రామకృష్ణ, నవీన్, డాక్టర్ ప్రభావతి, శివరామకృష్ణ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే లక్ష్యసాధన: ఎంఈవో రాథోడ్


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శంకర్ రాథోడ్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే తమ లక్ష్యాలను సులువుగా చేరుకోగలుగుతారని రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండల స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్ పోటీలు సోమవారం మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. మండల పరిధిలోని 10వ తరగతి విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొన్నారు. పరీక్షను అబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించి వివిధ మాధ్యమాలపరంగా జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఇంగ్లిష్ మీడియంలో కార్తీక్, ఆదిత్యకుమార్, రాగ భవ్య, తెలుగు మీడియంలో రాజ్‌కుమార్, భువనేశ్వరి, శివత్రివేణి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శంకర్ రాథోడ్ మాట్లాడుతూ... భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సంసిద్ధం చేస్తున్న సాంఘిక శాస్త్ర ఫోరం సేవలు అభినందనీయమని కొనియాడారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఇంకా బాగా చదివి రాష్ట్ర స్థాయికి ఎంపికై రాజేంద్రనగర్ మండల పేరును ముందు వరుసలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం ప్రధాన కార్యదర్శి ఎ.జంగయ్య, రాజేంద్రనగర్ మండల ఫోరం కన్వీనర్ ఆర్.అనురాధా, సి.హెచ్.అంజయ్య, మధుకర్‌రెడ్డి, ప్రభాకర్, సీతయ్య, రేణుకా, జనార్దన్‌చారి, సి.హెచ్.అంజయ్య, జోత్స్న, ప్రసన్న లక్ష్మి, రాజు, భారతి తదితరులు పాల్గొన్నారు.